గ్యాస్ ధరలు పెంచడం దారుణం.

యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షేక్ సఫీ ఉల్లా

విశాలాంధ్ర-పెందుర్తి: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు వ్యతిరేకంగా గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలను దారుణంగా మోసం చేసిందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ ఉల్లా ఆక్షేపించారు. గురువారం పెందుర్తిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ధరలు పెంచబోమని నిత్యవసర ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ధరలను అమాంతం పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయిస్తూ వచ్చిన ఆదాయంతో పాటు ప్రజలపై మోపిన పన్నుల ఆదాయాన్ని ఏమి చేస్తున్నారో తెలపాలని సఫీ డిమాండ్ చేశారు. గత 10 ఏళ్లుగా వ్యక్తిగత ఆదాయం తగ్గిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై గ్యాస్ పెట్రోల్ ధరలు భారాలు మోపడం దారుణమని మండిపడ్డారు ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

అవిశ్వాసంపై ఎవరి లెక్క వారిదే.....!

జనసేన కార్పొరేటర్లతో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ భేటీ
క్యాంప్ రాజకీయాల్లో మలేషియా కు టిడిపి కార్పొరేటర్లు
శ్రీలంకకు వైసిపి కార్పొరేటర్లు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : గ్రేటర్ విశాఖలో రాజకీయాలు ముదిరి పాకానపడ్డాయి. జీవీఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాసం అధికార, ప్రతిపక్ష పార్టీలకు సవాల్ గా మారింది. ఇప్పటికే గత 15 రోజులకు క్యాంప్ రాజకీయాలు చోటుచేసుకున్నాయి. తాజాగా టిడిపి కార్పొరేటర్లు కూడా మలేషియా చెక్కేశారు. ఇప్పటికే వైసీపీ కార్పొరేటర్లు బెంగళూరు టూర్ ముగించుకొని అటు నుంచి అటుగా శ్రీలంక వెళ్లిపోయారు. క్యాంప్ రాజకీయాలకు జనసేన దూరంగా ఉంటుందని ఆ పార్టీ నేతలు ఎప్పటికీ తెలియజేశారు. కూటమి నిర్ణయానికి కట్టుబడి ఉండాలని ఆ పార్టీ నేతలు అంటున్నారు. గురువారం జనసేన విశాఖ జిల్లా కార్యాలయం లో విశాఖ జిల్లా అధ్యక్షులు దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సూచనలు మేరకు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ వసంత లక్ష్మి అధ్వర్యంలో జీవీఎంసీ మేయర్ డిప్యూటీ మేయర్ అవిశ్వాసం పై 11 మంది కార్పొరేటర్లు తో సమావేశం జరి గింది. ఈ సమావేశంలో జనసేన పార్టీ నగర అద్యక్షులు వంశీకృష్ణ మాట్లాడుతూ జనసేన కార్పొరేటర్లు ఏకాభిప్రాయం తో అవిశ్వాసంకి సపోర్ట్ చేయాలని, తగు సూచనలు ఇవ్వటం జరిగిందనీ తెలిపారు. పార్టీ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని, పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాటే అందరికి శిరోధైర్యం అని చెప్పటం జరిగిందన్నారు. ఇందులో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దల్లి గోవింద్ , కార్పొరేటర్లు మూర్తి యాదవ్ , కందుల నాగరాజు , సాదిక్, లీలావతి, మేరీ జోన్స్, ఉషశ్రీ, పూర్ణ శ్రీ, బట్టు సూర్యకుమారి, కంటిపాము కామేశ్వరి పాల్గొన్నారు.

అవిశ్వాసం పై ఎవరు లెక్క వారిదే....

జీవీఎంసీలో 98 వార్డుల్లో కార్పొరేటర్లు గెలుపొందగా, ఒకరు మేయర్ కాగా, మరొకరు దక్షిణం నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ రాజీనామా చేసి ఎమ్మెల్యేగా గెలుపొం దారు. జీవీఎంసీలో మొత్తం కార్పొరేటర్లు ఎక్స్ అఫీషియల్ సభ్యులతో కలిపి 111 మంది ఉన్నారు. వీరిలో కూటమి సభ్యులకు 70 మంది మద్దతు ఉందని ప్రచారం సాగుతుంది. భీమిలి మాజీ ఎమ్మెల్యే ముత్తం శెట్టి శ్రీనివాస్ కుమార్తె ప్రియాంక కూటమి ఓటు వేస్తుందని ప్రచారం. సిపిఐ, సిపిఎం కార్పొరేటర్ల ఓట్లు కూడా కీలకంగా మారాయి. వైసిపికి ప్రస్తుతం 33 మంది కార్పొరేటర్లు ముగ్గురు ఎక్స్ అఫీషియల్ సభ్యులు ఉన్నట్లు తెలుస్తుంది. అవిశ్వాసం పరీక్షలో 74 మంది ఓటేస్తే తప్ప ప్రస్తుత మేయర్ హరి వెంకట కుమారి పదవికి ఎలాంటి గండం ఉండదని నిపుణులు అంటున్నారు. ఈనెల 19వ తేదీన మేయర్ పై అవిశ్వాస ప్రత్యేక కౌన్సిల్ సమావేశాన్ని కలెక్టర్ ఏర్పాటు చేశారు. అసలు ఈ సమావేశం జరుగుతున్న లేదా అన్నది కూడా అందరికీ గందరగోళంగా మారింది. కోరానికి సరిపడే కార్పొరేటర్లు ఈ సమావేశానికి హాజరు కారని మరోపక్క ప్రచారం సాగుతుంది. టిడిపి కార్పొరేటర్లు గత కొన్ని రోజులుగా భీమిలిలో క్యాంప్ రాజకీయంలో ఉండి తాజాగా బుధవారం రాత్రి మలేషియా వెళ్ళిపోయారు.

కళ్యాణ ఉత్సవాల్లో భాగంగా నేడు పలు కార్యక్రమాలు



విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి వార్షిక తిరు కళ్యాణ ఉత్సవాల్లో భాగంగా నేడు ఉ 04-00 గం॥లకు సుప్రభాత సేవ, ఆరాధనం, విశేష హోమాలు, బాలభోగం, గ్రామ బలిహరణం. ఉ 06-30 గం?ల నుండి ఉ గం॥ 07-00 గం॥ల వరకు: మంగళా శాసనము. ఉ 07-30 గం ల నుండి ఉ 11-30 గం॥ల వరకు సర్వ దర్శనములు. మ? 11-30 గం఼఼ల నుండి మ. 12-30 గం॥ల వరకు మహా రాజభోగము (దర్శనములు నిలుపుదల చేయబడును). సా॥ 05-00 గం॥లకు సూర్యప్రభ వాహనంపై తిరువీధి సేవ. సా॥ 07-00 గం॥లకు : ఆరాధనం, నివేదనం, విశేష హెూమములు, గ్రామబలిహరణం, మంగళాశాసనము. 10-00 గంటలకు పవళింపు, కవాటబంధనం.

ముఖ్య గమనిక : తేదీ 7 /4/ 2025 నుండి తేదీ 14/ 4 /2025 వరకు సుప్రభాత సేవ టికెట్లు ,రెండు పూటలా ఆరాధన సేవ, ఆర్జిత సేవలు రద్దు చేయబడినవి. అదేవిధంగా రాత్రి 7 గంటల తర్వాత భక్తులకు స్వామివారి దర్శనం లభించవు. తేదీ 13 /4 /2025నా ఆదివారం శ్రీ పుష్పయాగము సందర్భంగా సాయంత్రం 6 గంటల నుండి భక్తులకు దర్శనం లభించవు.

పేద విద్యార్థుల ఉచిత విద్యపై ఎట్టకేలకు ప్రభుత్వ నిర్ణయం..!

విశాలాంధ్ర కథనానికి స్పందన
ప్రైవేట్ స్కూల్స్ లో 25% కోటా అమలు చేయాలంటూ జీవో నెంబర్ 9 విడుదల

ఉచిత విద్య నిర్వీర్యం

విశాలాంధ్ర-విశాఖపట్నం: రాష్ట్రంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో 25% సీట్ల మేర ఉచిత విద్య అందించేందుకు ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 9 విడుదల చేసింది. ప్రైవేట్ పాఠశాలల్లో 20% ఉచిత కోటా పై గతంలో తాము జారీ చేసిన జీవో నెంబర్ 6 ను సస్పెండ్ చేస్తూ నూతన జీవో విడుదల చేసింది. 2022 హైకోర్టు ఆదేశాలతో ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలలలో 25 శాతం సీట్లు పేద పేద విద్యార్థులు కి కేటాయించేలా గత ప్రభుత్వం రాష్ట్రంలో చట్టాన్ని అమలు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దానిపై సందిగ్ధత నెలకొనడంతో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఉచిత సీట్లు పొందిన విద్యార్థులు తల్లిదండ్రుల వద్ద ఫీజులు వసూలు చేశారు. పేద విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వెలుగులోకి తెస్తూ గతంలో విశాలాంధ్ర పత్రిక ఒక కథనాన్ని ప్రచురించింది. ఎట్టకేలకు స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ బడుల్లో పేద విద్యార్థులకు 25 శాతం కోటా అమలు చేయాలంటూ తాజా గా నిర్ణయం తీసుకోవడంతో ఆయా విద్యార్థులు తల్లిదండ్రులు, పలు విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయపక్షాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు హర్షాన్ని వ్యక్తపరి చాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో 25% ఉచిత కోటాలో ఇప్పటికే ప్రవేశాలు పొందిన విద్యార్థులు, ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఒక స్పష్టత లభించింది.

నేడు విద్యుత్ సరఫరా కు అంతరాయం

విశాలాంధ్ర-ఆనందపురం : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్ 3 పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నేడు పెద్ది పాలెం 11 కెవి మరమ్మత్తులు నిమిత్తం శుక్రవారంఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆనందపురం మండలంలో చందక, పొడుగు పాలెం , జగన్నాధపురం, గొట్టిపల్లి, కుసలవాడ,తదితర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించవలసిందిగా మండల ఎలక్ట్రికల్ ఏఈ అప్పలనాయుడు తెలిపారు.

భవిత బాటకు భాష్యం చెప్పేవి కలలు

వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర-విశాఖ సిటీ : భవితబాటకు కళలు భాష్యం చెబుతాయని వి.ఎం.ఆర్.డి.ఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. గురువారం ఉదయం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్ లో విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ప్రతిభావంతుల ప్రోత్సాహ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో చోటు చేసుకుంటున్న అంశాలపై ప్రజల్లో అవగాహన కలిగించటంతో పాటు జన జాగృతికి కళలు ఎంతో తోడ్పడుతున్నాయన్నారు. విశాఖ జిల్లాలోని ప్రతిభావంతులైన ఎంతోమంది కళాకారులు ఉన్నారని ఎన్నో సందర్భాల్లో వుడా వి.ఎం.ఆర్.డి.ఏ వీరిని ప్రోత్సహించిందన్నారు. విశాఖ జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జనార్ధన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు యాద కుమార్, నంది అవార్డు గ్రహీత శివ జ్యోతి, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈస్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధి బి. కే. రామేశ్వరి, ఈ టీవీ పాడుతా తీయగా సంగీత కళాకారులు కీరవాణి ప్రసాద్, ధనుంజయ, తాళ్లపాక సందీప్, పక్కి అరుణ్ సాయి, కరెమ్ మమత తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా బస్ కాంప్లెక్స్ లో ఆర్టీసీ చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: వేసవి తాపాన్ని ప్రయాణికులకు తీర్చేందుకు ఆర్టీసీ చలివేంద్రం కేంద్రాన్ని ప్రారంభించింది. గురువారం ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్, విశాఖపట్నం బి.అప్పల నాయుడు సారధ్యం లో ఏపీఎస్ఆర్టీసీ ద్వారకా బస్‌స్టేషన్ కాంప్లెక్స్ లో ప్రయాణికులకు సిబ్బందికి చలివేంద్రం ఏర్పాటుచేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు ముఖ ద్వారం అయినా ద్వారకా బస్‌స్టేషన్‌లో ఈ వేసవి కాలంలో ఈ చలివేంద్రము ఉండునని తెలియజేసినారు. ఈ చలివేంద్రం మొదటగా ఏపీఎస్ఆర్టీసీ సిబ్బంది సహకారంతో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని బస్ స్టేషన్ లో కూడా విశాఖ జిల్లాలో ఈ చలివేంద్రులు ముఖ్య వేళల్లో ఉండునని, దాతలు కూడా వచ్చి బస్ స్టేషన్ బస్టాపుల్లో కూడా చలివేంద్రియాలు ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి ఏడాది చలివేంద్రియాలు ఏర్పాటు చేస్తున్నామని,

విద్యార్థులతో ట్రాఫిక్ పై అవగాహన సదస్సు

వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి
ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు

విశాలాంధ్ర-ఆనందపురం : వేములవలస జంక్షన్ సర్కిల్ వద్ద గురువారం ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ పట్ల అవగాహన కల్పించే విధంగా విద్యార్థులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హెల్మెట్ ధరించడం వల్ల కలుగు ప్రయోజనాలు, త్రిబుల్ రైడింగ్ వలన నష్టాలు, ఓవర్ స్పీడు, సిగ్నల్ లైట్ క్రాసింగ్, కారు డ్రైవింగ్ చేసేటప్పుడు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని, విద్యార్థులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని, పిల్లలకు వారి తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని మైట్కనర్ డ్రైవింగ్ చాలా నేరమని,సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది ఆకుల శంకర్, రాజు, శంకర్రావు పాల్గొన్నారు.

క్రికెటర్ వెలుగోటి రాజగోపాల్ యాచేంద్ర సేవలు చిరస్మరణీయం

సంతాపం తెలిపిన ఏసీఏ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్, ఏసీఏ కార్యదర్శి రాజ్యసభ ఎంపి సానా సతీష్ బాబు

విశాలాంధ్ర-పీయం పాలెం: మాజీ ఆంధ్రా రంజీ క్రికెట్ టీమ్ కెప్టెన్ వెలుగోటి రాజగోపాల్ యాచేంద్ర(93) మృతిపై ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఏసీఏ కార్యదర్శి, రాజ్యసభ ఎంపి సానా సతీష్ బాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం ఆంధ్రప్రదేశ్ క్రికెట్ రంగంలో తీరని లోటని ఏసీఏ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాచేంద్ర వయోభారం కారణంగా నెల్లూరు జిల్లా వెంకటగిరిలో గురువారం మృతి చెందారు. రాజగోపాల్ యాచేంద్ర పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని కోరుకుంటూ శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు ఏసీఏ తరఫున ఏసీఏ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని),రాజ్యసభ ఎంపి సానా సతీష్‌బాబు తన ప్రగాఢ సానుభూతి తెలియజేయటంతోపాటు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా వెంకటగిరికి చెందిన యాచేంద్ర ఆంధ్ర రంజీ క్రికెట్ టీమ్ లో 1956 నుంచి 1965 మధ్య 15 రంజీ ట్రోఫీ మ్యాచ్ ల్లో బ్యాటింగ్ తో పాటు లెగ్ బ్రేక్ బౌలింగ్ చేసి ప్రతిభ గల క్రికెటర్ గా గుర్తింపు తెచ్చుకోవటంతో పాటు 1963 నుండి 1965 వరకు ఆంధ్ర జట్టుకు నాయకత్వం వహించారన్నారు. ఆంధ్ర రంజీ క్రికెట్ టీమ్ లో ఆడి ఎంతో మంది క్రికెట్ క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. బహుముఖ క్రీడా సామర్థ్యాలతో క్రికెటర్ గానే కాకుండా టేబుల్ టెన్నిస్ లో కూడా అగ్రశ్రేణి ఆటగాడిగా మంచి గుర్తింపు పొందిన యాచేంద్ర నేటితరం క్రీడాకారులకు ఆదర్శమన్నారు.

అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించండి : బలిరెడ్డి వినతి

విశాలాంధ్ర-గాజువాక: అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని అగనంపూడి అభివృద్ధి కమిటీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం గాజువాక నియోజకవర్గం ఎమ్మెల్యే పల్ల శ్రీనివాసరావును పార్టీ కార్యాలయంలో కలిసి ఓ వినతి పత్రాన్ని అందజేశారు. విద్యపరంగా దినదిన ప్రవర్ధమానమవుతున్న ఈ కళాశాలలో అందుకు తగ్గట్టుగా వసతులు కల్పన చేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఇప్పుడు కొనసాగుతున్న ప్రధాన గ్రూపులు సహా బైపిసి గ్రూపును కూడా ప్రవేశపెట్టాలని ఆయన ఆ వినతిపత్రంలో సూచన చేశారు. పర్మినెంట్ ప్రిన్సిపాల్ తో పాటు ఒకేషనల్ కోర్సులకు సంబంధించి అధ్యాపకుల నియామకాన్ని కూడా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కళాశాలకు సంబంధించి వీటితోపాటు స్థానిక ప్రధాన సమస్యలను కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పందిస్తూ గాజువాక నియోజకవర్గ ప్రాంతానికి ఎన్నో పోరాటాల ఫలితంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలను సాధించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. కళాశాల అభ్యున్నతి కోసం అవసరమైన చర్యలన్నీ చేపట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే ఈ కళాశాల రాష్ట్ర స్థాయిలో విద్యాబోధనలో ఫలితాలు సాధించడంలో మంచి గుర్తింపు పొందుతున్నదని తెలుపుతూ అభినందనలు తెలిపారు. అలాగే విద్యార్థులు కనబరుస్తున్న ప్రతిభ పాఠవాలను కూడా ఉటంకిస్తూ హర్షం వ్యక్తం చేశారు. కళాశాల లో విద్యార్థుల ఉత్తమ ఫలితాలు కోసం అధ్యాపకులు విశేష కృషిని కనబరచాలని హితవు పలికారు. ఇక్కడి కళాశాలలో ప్రాథమిక వసతుల కల్పన కోసం అన్ని చర్యలు చేపడతామని మాట ఇచ్చారు. కొత్తగా అధ్యాపకుల నియామకంతో పాటు అవసరమైనటువంటి ప్రధాన గ్రూపులు ప్రవేశానికి కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం లో జీవీఎంసీ 85 వ వార్డు టిడిపి ఇన్చార్జ్ గంతకోరు అప్పారావు 79 వ వార్డు టిడిపి సీనియర్ నాయకులు గొల్లవిల్లి వెంకటరావు తెలుగు యువత నాయకులు బందారు చందు రమేష్ పాల్గొన్నారు.

మహిళా రక్షణ చట్టాలను పగడ్బందీగా అమలు చేయాలి

ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎంఏ బేగం

విశాలాంధ్ర-పెందుర్తి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం రూపొం దిస్తున్న చట్టాలు మొక్కుబడి తంతుగా మారిపోతున్నాయని అవి ఏమాత్రం మహిళ లకు రక్షణ చేకూర్చడం లేదని ఏపీ మహిళా సమాఖ్య విశాఖ జిల్లా కార్యదర్శి ఎంఏ బేగం ఆక్షేపించారు గురువారం సాయంత్రం పెందుర్తి మండల పరిషత్ కార్యాలయం వద్ద గల అంబేద్కర్ విగ్రహం ముందు మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు రూపొందించి పగడ్బందీగా అమలు చేయాలని కోరుతూ ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎంఏ బేగం మాట్లాడుతూ ప్రభుత్వాలు రూపొం దించిన దిశ, అభయ వంటి చట్టాలు అమలులో పోలీసులు విఫలమవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. మధురవాడలో ఓ బాలికపై ఉపాధ్యాయుడు దాడులకు పాల్పడ్డారని, అలాగే ప్రేమ పెళ్లికి అంగీకరించలేదని తల్లి కూతురిపై ఓ యువకుడు దాడికి పాల్పడగా తల్లి ప్రాణాలు కోల్పోయిందని, అక్కయ్యపాలెంలో ప్రేమ పేరుతో యువతని వేధింపులు గురి చేశారని ఇలాంటి ఘటనలు సమాజంలో కోకొల్లలుగా జరుగుతున్నాయని విమర్శిం చారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు స్పందిస్తున్న పోలీసులు నిందితులను వెంటనే వదిలేస్తున్నారని దీంతో వారు సమాజంలో విచ్చలవిడిగా దారుణాలకు పాలుపడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో ఏపీ మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు రాధ, మండల కార్యదర్శి అన్నపూర్ణ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

తల్లి, కూతుర్లపై హత్యాయత్నం...

విశాఖలో వరుస సంఘటనపై ఆందోళన...

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ప్రేమించి పెళ్లికి నిరాకరించిందని మధురవాడలో ఓ యువతి దీపిక, ఆమె తల్లిపై ప్రేమోన్మాది కత్తితో ఇటీవల దాడి చేసిన ఘటన మరువక ముందే, విశాఖ నగరంలో అలాంటి ఘటన మరొకటి గురువారం చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ఉన్నాయి. గాజువాకకు చెందిన యువకుడు(18) అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన బాలిక(17)ను సంవత్సర కాలంగా ప్రేమిస్తున్నాడని, వీరిద్దరు ఇంటర్ చదువుతున్నారని, అయితే ఆమె కుటుంబ సభ్యులు వేరొకరితో వివాహ ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ విషయం తెలుసుకున్న ఆ యువకుడు బుధవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో అక్కయ్య పాలెంలోని బాలిక ఇంటికి వచ్చాడు, తన వెంట తెచ్చిన కత్తితో తొలుత బాలిక తల్లి(40)పై విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో ఆమె మెడ,చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. బాలిక మెడపై చేతులతో గట్టిగా నొక్కేశాడు. ఇంతలో వారి అరుపులు విన్న స్థానికులు అక్కడికి చేరుకొని వారిని రక్షించారు. తరువాత పోలీసులకు సమాచారం ఇవ్వగా, నాలుగో పట్టణ పోలీసులు వచ్చి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కత్తిని స్వాధీనం చేసుకున్నారు. బాధితులకు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్‌కై పోరాడతాం

అంబేద్కర్ జయంతి ర్యాలీ, భారీ సభ జయప్రదం చేయండి : అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: సమానత్వం, స్వేచ్ఛ స్వాతంత్రం కోసం నిర్మితమైన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నంలో ఉందని అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ (ఏఎంఎస్) అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు కళ్యాణ్ రావు, జెవి ప్రభాకర్ తెలిపారు. అంబేద్కర్ భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో నూతనంగా ఎన్నికైన కమిటీ ని పరిచయం చేశారు. అంబేద్కర్ జయంతి మహెూత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవి ప్రభాకర్ మాట్లాడుతూ రాజ్యాంగం భారతీయులంతా స్వేచ్ఛ సమానత్వంతో బ్రతికేందుకు ఏర్పాటు అయింది అన్నారు. అయితే బిజెపి ఆర్ఎస్ఎస్ తమ సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తూ భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ సంస్థలన్నిటిని విక్రయిస్తూ ఎస్సీ ఎస్టీలకు ఉపాధి లేకుండా ,రిజర్వేషన్ లను దూరం చేసే పన్నాగం పన్నుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేటు రంగంలో కూడా రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కేంద్ర మంత్రులు ఎంపీలకు వింత పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

అంబేద్కర్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు

అంబేద్కర్ భవన్ (ఏఎంఎస్) ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా ఉదయం 8 గంటలకు ఎల్ఐసి కోడ్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అలంకరణ అదే విధంగా సాయంత్రం నాలుగు గంటలకు ఎల్ఐసి కూడలి నుంచి అంబేద్కర్ భవన్ వరకు ఊరేగింపు అనంతరం భవనంలో భారీ సభ నిర్వహించినట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి ఐఏఎస్ అధికారులు ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు అంబేద్కర్ భవనాన్ని విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్ది అందరికీ అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కోశాధికారి జి సత్యనారాయణ ఉపాధ్యక్షులు అలమండ ప్రసాద్ భక్తులు గౌతం పతివాడ రాంబాబు చిరంజీవి రాజాన సరస్వతి అప్పారావు, ఎస్ రాజులు తదితరులు పాల్గొన్నారు.

పార్క్ లు, గ్రీన్ బెల్ట్స్ అభివృద్ధి పనులను పరిశీలించిన డిప్యూటీ మేయర్..



విశాలాంధ్ర- గోపాలపట్నం: విశాఖ పశ్చి మ నియోజక వర్గం 52వ వార్డు వలు ప్రాంతాలలో గ్రీన్ బెల్ట్ లు వాకింగ్ ట్రాకులలో అధికారులతో కలసి విశాఖ నగర డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్ సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ మేరకు గురువారం మర్రిపాలెం ఉడా లే అవుట్ ప్రాంతంలో ఆర్ & బి జం॥ దరి లలితా డిలైట్ గ్రీన్ బెల్ట్ , వనితా వాకింగ్ ట్రాక్, పాస్ పోర్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న గ్రీన్‌బెల్ట్ లో మోడల్ లైటింగ్, బ్యూటిఫికేషన్ పనులు, వాటర్ సప్లై మొదలైన అభివృద్ధి పనులను అధికారులతో కలసి చర్చించారు. అనంతరం కరాస హిందూ-ముస్లీం-క్రైస్తవ శ్మశాన వాటికలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల ను కొత్తగా మంజూర కాబడిన పనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ , సుందరీకరణ విభాగాల అధికా రులను అభివృద్ధి పనుల నిర్మాణం వేగవంతం చేయలని కోరారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఏఈ ఉషా, ఎలక్ట్రికల్ ఏ.ఈ అర్చన, హార్టికల్చర్ ఏ.అ పల్లవి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, పారుశుధ్య విభాగం ఇన్స్ పెక్టర్ మూర్తి , ఇంజనీరింగ్ వర్క్ ఇన్స్ పెక్టర్ అవూప్, సాయి,పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి "పైడా కౌశిక్" నాటకోత్సవాలు

- 20వ రాష్ట్రస్థాయి ఆహ్వాన సాంఘిక నాటికల పోటీలు - 2025
- వీఎండిఏ అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు

విశాలాంధ్ర-విశాఖ సిటీ: ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు కళాభారతి ఆడిటోరియంలో "పైడా కౌశిక్" నాటకోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వి.ఎమ్.డి.ఎ., నాటకోత్సవాల అధ్యక్షులు మంతెన సత్యనారాయణరాజు తెలిపారు. గురువారం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో 20వ రాష్ట్రస్థాయి ఆహ్వాన సాంఘిక నాటికల పోటీలు -2025 నిర్వహిస్తున్నామన్నారు. గత 20 సంవత్సరాలుగా నిర్వహించబడుతున్న నాటకోత్సవాలు, ఈ ఏడాది 12, 13, 14, 15 మరియు 16 ఏప్రియల్, 2025 తేదీలలో నిర్వహంచబడుతున్నాయని తెలియజేశారు. వి ఎం డి ఏ మేనేజింగ్ ట్రస్టీ, ఉత్సవాల కార్యదర్శి డాక్టర్ జి ఆర్ కె ప్రసాద్ (రాంబాబు) ఉత్సవాల వివరాలను వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 28 ఎంట్రీలు వచ్చాయని, వాటిన్నింటిని ప్రోగ్రాం కమిటీ సభ్యులందరూ అధ్యయనం చేసి 9 నాటికలను ఎంపిక చేశారన్నారు, మొదటి 4రోజులు, రోజుకు రెండు నాటికలు, చివరి రోజు 16-4-2025 తేదీన ఒక నాటిక ప్రదర్శించబడి, ఆ తరువాత వెంటనే బహుమతి ప్రదానోత్సవం జరుగునని వివరించారు. ఈ పోటీలలో నాటికలను ప్రదర్శించే స్థానికేతర సమాజాల వారికి ప్రదర్శన పారితోషికం రూ. 16,000 లతో పాటు లోకల్ కన్వేయన్స్ నిమిత్తం రూ. 4000లు అదనంగా అందజేయబతున్నదన్నారు. ప్రదర్శన రోజున మాత్రం వీరికి ఉచితంగా వసతి ఏర్పాటు చేయబడుతున్నదని తెలిపారు. స్థానిక సమాజాల వారికి ప్రదర్శన పారితోషికం రూ.16,000లతో పాటు అదనంగా లోకల్ కన్వేయన్స్ నిమిత్తం రూ. 2000లు అందజేయ బతున్నదని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన ఉత్తమ ప్రదర్శనకు రూ.18,000లు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.15,000లు, తృతీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.12,000 లు చతుర్ధ ఉత్తమ ప్రదర్శనకు రూ. 10,000లు నగదుతో పాటు జ్ఞాపికలు అందజేస్తామని చెప్పారు. 12 వ్యక్తిగత బహుమతులు ఒక్కొక్కరికి రూ. 1500లు, జ్ఞాపికలు అందజేయ బడుతాయన్నారు. మూడు జ్యూరీ బహుమతులు ఒక్కొక్కరికి రూ. 1000లు నగదుతో పాటు జ్ఞాపికలు అందజేయబడుతాయని, ప్రోత్సాహక బహుమతుల క్రింద నాటికలలో పాల్గొన్న ప్రతి బాల, నటీ నటులకు రూ.1000 లు నగదుతో పాటు జ్ఞాపికలు బహూకరించబడతాయన్నారు. ఈ పోటీలలో ప్రదర్శించిన ప్రతి నాటిక రచయిత, దర్శకుడికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. నాటకోత్సవాల మహారాజపోషకులు పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తెలుగు నేలమీద ప్రఖ్యాతిగాంచిన ఈ నాటకోత్సవాలకు మహారాజపోషకులుగా వుండటం తనకు చాలా సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. రాబోయే కాలంలో కూడా ఈ నాటకోత్సవాల నిర్వహణకు తనవంతు సహాయ సహకారాలు ఇలాగే కొనసాగిస్తానని చెప్పారు. అన్ని రోజులు నాటికల ప్రదర్శనలకు ప్రవేశం ఉచితమని, వచ్చిన ప్రేక్షకులకు ప్రతిరోజు లాటరీ తీసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఏ రోజుకారోజు నాటికల ప్రదర్శనల అనంతరం ఇవ్వబడుతాయన్నారు.

IN THE HONOURABLE COURT OF THE 12th ADDL. DISTRICT JUDGE COURT AT VISAKHAPATNAM
O.S.63/2025

Between:
Catherine Academy of General and Technical Education, Rep. by its Special Power of Attorney Holder
i.e. **P. Ravi Kumar** ... Plaintiff
And:
1. Seemakurthi Bangarraju
2. Seemakurthi Sankararao
3. Seemakurthi Raja
4. SRO, Bheemunipatnam
5. MRO, Bheemunipatnam
(defendants 4 and 5 are proper and necessary parties only) ..... Defendants

బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటుది అయిన ఈ దిగువ షెడ్యూల్ దాఖల ఆస్తి.

SCHEDULE
District : Visakhapatnam
Mandalam : Bheemunipatnam
Village : Chittivalasa
S.No. : 83/2
Extent : Ac.01-25 cents
Nature of land : Dry land
Bounded as follows :
East : Land belongs to defendants
South: Dry land of Kasani Chandramouli
West: Dry land of child Sankarareddy and others
North: Land belongs to defendants
విషయమై సదరు పైన తెలిపిన శ్రీవారి కోర్టులో టైటిల్ కేసు వేసి యున్నందున, మరియు వాయిదా రూపంలో ఉన్నందున ఈ షెడ్యూల్ దాఖల ఆస్తి వ్యవహారంలో ఎవరైనా, ఏ రకమైనా లావాదేవీలు జరిపినప్పటికీ చెల్లనేరవని తెలియజేయడమైనది.

ఇట్లు
జి. శివప్రసాద్
కే. శ్రీనివాసరావు
అడ్వకేట్స్, విశాఖపట్నం
సెల్: 868884963

కూటమి ప్రభుత్వం అరాచకాల్ని ఉపేక్షించరాదు

పోలీసులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ని అరెస్టు చేయాలి గాజువాక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన తెలుగు శక్తి అధ్యక్షులు బివి రామ్

విశాలాంధ్ర-విశాఖ సిటీ : పోలీసులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిని అరెస్టు చేసి చట్ట ప్రకారం శిక్షించాలని తెలుగు శక్తి అధ్యక్షులు డివి రామ్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. సత్య సాయి జిల్లా రాప్తాదులో మంగళవారం వైయస్ జగన్ పర్యటించిన నేపథ్యంలో పోలీసులను బట్టలూడదీసి కొడతానంటూ వ్యాఖ్యలు చేయడం శోచనీయం అన్నారు. కూటమి ప్రభుత్వం ఇటువంటి అరాచకాల్ని ఉపేక్షించరాదన్నారు. ఈ మేరకు ఆయన గాజువాక పోలీస్ స్టేషన్లో గురువారం ఫిర్యాదు చేశారు. ఒక మాజీ ముఖ్యమంత్రి ఇలాంటి మాటలు మాట్లాడటం వల్ల ప్రజలలో పోలీసులు పట్ల చులకన భావం ఏర్పడుతుందన్నారు. గాజువాక పోలీస్ స్టేషన్ లో తాను ఇచ్చిన కంప్లైంట్ స్వీకరించి రసీదు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ విషయంపై హెూంమంత్రి వంగలపూడి అనిత వెంటనే స్పందించాలని కోరారు.

సామాజికసేవకు ప్రతిరూపం కోరాడ నాగభూషణం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర-భీమిలి: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోరాడ నాగభూషణం మరణం పార్టీకి, భీమిలి నియోజకవర్గానికి తీరని లోటని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. గురువారం ఉదయం అకాలరమరణం పొందిన నాగభూషణం పార్థివదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం గంటా నూకరాజు మీడియాతో మాట్లాడారు. సామాజిక సేవలో, సంఘ సేవలో ఎప్పుడూ ముందుండేవారని అన్నారు. ఎవరైనా అన్నార్తులు కష్టంతో వారి తలుపుతడితే సాయం చేసి పంపే చేతులను భీమిలి నియోజకవర్గం కోల్పోయిందని అన్నారు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలంగా ఉండి పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా మచ్చలేని పాలనకు శ్రీకారం చుట్టారని అన్నారు. ఎంతో హుందాగా రాజకీయాలు చేశారని, అందరినీ కలుపుకుంటూ చిరునవ్వుతో పలకరించే మా నాగభూషణం ఇకలేరని తెలుసుకొని ఆప్తులు, అన్నార్తులు తల్లడిల్లారని అన్నారు. నాగభూషణం భౌతికంగా మనమధ్య లేకపోయినా ఆయన చేసిన సేవలు రూపంలో అనుక్షణం మనమధ్యే ఉంటారని అన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యం ఇవ్వాలని గంటా నూకరాజు కోరారు.

గాదిరాజు ప్యాలెస్ లో ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ ఎక్స్ పో ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖపట్నం : దేశంలోని ప్రముఖ పారిశ్రామిక ప్రదర్శనల సంస్థ ఇండోర్ ఇన్ఫో లైన్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహణలో బీచ్ రోడ్ లోని గాదిరాజు ప్యాలస్ లో ఇండస్ట్రియల్ & ఇంజనీరింగ్ ఎక్స్ పో ప్రారంభించారు. ఈ పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన ఏప్రిల్ 11, 12 & 13 తేదీలలో మూడు రోజులు పాటు పారిశ్రామిక ఇంజనీరింగ్ సంబంధిత నూతన ఆవిష్కరణలతో కూడిన ఉత్పత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్నామని ఆ సంస్థ ఎండి ఆర్. కె. అగర్వాల్ తెలిపారు. ఇండోర్ ఇన్ఫో లైన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గత దశాబ్ద కాలంగా పారిశ్రామిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నదన్నారు. ఈ ప్రదర్శనకు వాసివా, ఎమ్ ఎస్ ఎంఇ ఇండస్ట్రీస్ అసోసియేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఏ పీ స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్స్ ఇతర అసోసియేషన్లు మద్దతు అందిస్తున్నాయన్నారు. ఈ ప్రదర్శన సందర్శనకు దేశం నలుమూలల నుండి సుమారు 10,000 మందికి పైగా సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్నామని, ఈ ప్రదర్శన ఎం ఎస్ ఎం ఈ రంగ విస్తరణకు దోహదపడటమే కాక, సందర్శించే ప్రతి ఒక్కరికి వ్యాపార అవకాశం కల్పించే అవకాశం ఉందన్నారు. ఈ పారిశ్రామిక ప్రదర్శనలో 5000 యూనిట్ల వివిధ పారిశ్రామిక ఉత్పత్తులను ప్రదర్శించనున్నారన్నారు. ఈ ఉత్పత్తుల స్థూల విలువ రూ. 25 కోట్లు పైగా ఉంటుందని, ఈ ప్రదర్శనలో పాల్గొన్న అన్ని బ్రాండ్ల ద్వారా వచ్చే ఏడాది కాలంలో రూ.50 కోట్ల విలువైన అమ్మకాలను నమోదు చేస్తామని విశ్వసిస్తున్నామని చెప్పారు. ఈ ప్రదర్శన డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు మరియు తయారీదారులు తమ నెట్ వర్కింగ్ మరియు వ్యాపార విస్తరణకు గొప్ప అవకాశాలు కలిగిస్తుందని, భారతదేశం నలుమూలలలోని హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, చెన్నై, ముంబై, న్యూఢిల్లీ, కోల్ కతా, నాగపూర్ వంటి నగరాల నుండి 50 మందికి పైగా ఎగ్జిబిటర్లు ఈ ప్రదర్శనలో పాల్గొని తమ ఉత్పత్తులైన లేజర్ కటింగ్ మిషన్లు, చేతి పనిముట్లు, మిషన్ టూల్స్, స్టీల్ ఉత్పత్తులు, ఆటోమేషన్, వెల్డింగ్ పరికరాలు, బేరింగులు, సైంటిఫిక్ పరికరాలు, ల్యాబ్ పరికరాలు, మెటీరియల్ హెండ్లింగ్ ఉత్పత్తులు, భద్రతాపరమైన ఉత్పత్తులు, నిర్వహణా ఉత్పత్తులు, ఇంజనీరింగ్ ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నారని తెలిపారు.

కవులు, కళాకారులు ప్రజలపక్షం వహించాలి

అరుణోదయ సాహిత్య సభ ఘన నివాళి

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: సాంస్కృతికోద్యమ కేతనం, విప్లవోద్యమాల చైతన్య దీప్తి కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావు (తాత) మన మధ్య నుంచి వెళ్ళిపోయి పది సంవత్సరాలైంది. వీరగాథలు పాడి ఉద్యమానికి ఊపిరిలూదిన ఆ గళం, కాలం కరిగిపోతున్నా మనల్ని వెన్నంటే ఉంది. ప్రజా కళలకు పురుడు పోసి అరుణోదయాన్ని భావితరాలకు అందించిన ఆయన స్ఫూర్తి మనకు ఆదర్శంగా నిలిచిందని ప్రసిద్ధ కవి గాయకుడు సిరికి స్వామినాయుడు అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో గురువారం ఉదయం విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయం సమావేశ భవనంలో విప్లవ సాంస్కృతికోద్యమ సారథి కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావు పదో వర్ధంతి సందర్భంగా.. జరిగిన సాహిత్య సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలిత కానూరుని స్మరిస్తూ.. సభ నివాళులర్పించి సంతాపం ప్రకటించిన తర్వాత సిరికి మాట్లాడుతూ.... కానూరి పోరాటంలో పాల్గొన్న ప్రజల్ని కలిశాడు. వారితో మాట్లాడి వారి యాస, భాషతోనే అనేక కళారూపాలను సృష్టించాడు. రౌద్రం, హాస్యం, కరుణ తదితర కళల్ని రంగరించి బుర్రకథ, హరికథలను రాశాడు. ఆయన జీవిత కాలంలో 40 పుస్తకాలను రచించాడు. నిత్యం పఠించడం, నోట్స్ రాసుకోవడం ఆయనకు అలవాటు. నేటి కళాకారులు ఆయన నుండి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని ఆయన తెలిపారు. మట్టిలో వేళ్లు జొనిపి అన్నం ముద్దలు వెలికితీసే రైతు సంక్షోభం అంచులకు చేరి ఆత్మహత్యలు చేసుకుంటున్నాడు. వ్యవసాయ సంక్షోభం నుంచి కాపాడాల్సిన పాలకులు వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగానికి బలివ్వబోతున్నారు. రైతు పోరాటంతో మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకున్న మోడీ ప్రభుత్వం తిరిగి నూతన మార్కెట్ విధానాన్ని తీసుకువస్తోంది. దీనికి నిరసనగా రైతులు సమర శంఖాన్ని పూరిస్తున్నారని, పోరాటాల ద్వారానే సమాజం మారుతుందని, సమస్యలు పరిష్కారమవుతాయని స్వామినాయుడు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా స్వీయ రచనలను చదువుతూ... ఆలాపన చేస్తూ... సిరికి సభను ఉత్తేజపరిచారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ ప్రధాన ప్రసంగం చేస్తూ...50 వసంతాల నక్సల్బరీ, శ్రీకాకుళం పోరు హెూరును జనగానం చేసిన స్వరం మనకు బాట చూపింది. గోదావరి అలల సవ్వడిని అక్కున చేర్చుకుని సాగిన ప్రతిఘటనా ఉద్యమ స్వరాలకు రాగం, తాళం, పల్లవై ఎంతోమంది కళాకారుల హృదయాలపై చెరగని ముద్రలు వేసిన జ్ఞాపకాలు మనకు మిగిలే ఉన్నాయి. ప్రస్తుత పాలకుల ఫాసిస్టు విధానాలను ఆయన విమర్శిస్తూ... విశాఖ ఉక్కు లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు దోచిపెడుతున్నారు. అభివృద్ధి పేరుతో ఆదివాసి ప్రాంతాలను కార్పొరేట్లకు దారాదత్తం చేయడానికి మోడీ ప్రభుత్వం పూనుకుంది. జల్, జంగిల్, జమీన్ హమారా అంటూ అడ్డుకుంటున్నందుకు ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను హత్య చేసి పచ్చటి అడవులను నెత్తుటి చిత్తడి చేస్తోంది. మనువాదాన్ని పున ప్రతిష్టించడానికి కంకణం కట్టుకుంది. మహిళల్ని, పిల్లల్ని కనే యంత్రాలుగా మార్చి ఎక్కువమంది పిల్లల్ని కనండి అని ప్రజాప్రతినిధులే పిలుపునిస్తున్నారు. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం మూలాలపై దాడి చేస్తూ ఒకే దేశం, ఒకే చట్టం పేరుతో వివిధ జాతుల, మతాల ఆచార, సాంప్రదాయాలను తుంగలో తొక్కుతోంది. జాతీయ భాష పేరుతో ప్రాంతీయ భాషల అస్తిత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చబోతోంది. బలమైన కేంద్రం పేరుతో రాష్ట్రాల హక్కులను హరిస్తూ సమాఖ్య వ్యవస్థను దెబ్బతీస్తోందని సన్నశెట్టి అన్నారు. అమరుల త్యాగాలను గానం చేద్దాం. వారి నెత్తుటి జెండాలను ముద్దాడుకుందాం. , కళ కోసం కాదు. కళ ప్రజల కోసం అని కానూరి చూపిన బాటలో ఎలుగెత్తి చాటుదామని తన ప్రసంగాన్ని ముగించారు. ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యంత్ర

భూతములకు కోరలు తోమే కార్మిక వీరుల పోరాటాలతో సాధించుకున్న హక్కులను పార్లమెంటే రద్దుచేసి బాహాటంగా యాజమాన్యాలకు అండగా నిలబడుతోందనీ, కార్మికులను బానిసలుగా మార్చడానికి 70, 90 గంటలు పనిచేయాలని నిస్సిగ్గుగా యజమానులు మాట్లాడుతున్నారని విమర్శించారు. మాట్లాడే హక్కు, నిరసన తెలిపే హక్కు మాయమైపోతున్న వేళ కళాకారులు ఎటువైపు నిలబడాలి? ఈ స్థితిలో కళాకారుడు ఎవరి పక్షం వహించాలి? ఆట, పాటను ఎవరికోసం వినియోగించాలి? మనం కష్టజీవికి, విప్లవ పోరాట పతాకాలకు అండగా నిలబడాలనీ ప్రతీది మార్కెట్ చేయడం సామ్రాజ్యవాద సంస్కృతి. ప్రజా ఉద్యమాలు బలంగా ఉన్నప్పుడు జానపద బాణీలను విప్లవీకరించి ప్రజల్లోకి పెద్ద ఎత్తున కళాకారులు తీసుకెళ్లాలని యం.వి అన్నారు. అరుణోదయ రాష్ట్ర సహాయ కార్యదర్శి నిర్మల అధ్యక్షతన సాగిన సభలో ప్రజా గాయకుడు సారయ్య, ప్రసిద్ధ జానపద పరిశోధక రచయిత విజయనగరం నుంచి వచ్చిన బద్రి కుర్మారావు తదితరులు మాట్లాడారు. అరుణోదయ కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు సభను ఉత్తేజపరిచాయి. అరుణోదయ విశాఖ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఏడుకొండలు వందన సమర్పణ తర్వాత అందరూ కలిసి అంతర్జాతీయ శ్రామిక గీతాలాపనతో సాహిత్య సభ ముగిసింది. పలువురు మేధావులు, కళాకారులు, కవులు, ప్రజా సంఘాల నాయకులు ఈ సభలో పాల్గొన్నారు.

మాన్ ప్లస్ హమ్మెల్ ఎల్ గీ పటోన్ ఇంకుతో భాగస్వామ్యం

విశాలాంధ్ర-విశాఖపట్నం: వివిధ పరిశ్రమల్లో గాలి సాంద్రత, కంప్రెసెడ్ సిస్టం సమర్థ రీతిలో పనిచేసేందుకు నూతన వ్యవస్థను రూపొందించినట్లు మాన్ ప్లస్ హమ్మెల్ తయారీ ఇంజనీరింగ్ సీనియర్ మేనేజర్ స్టీవెన్ ఓవెన్స్ అన్నారు. తెలిపారు. వడపోత వ్యవస్థలను అందించడంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సంస్థలలో ఒకటైన మాన్ ప్లస్ హమ్మెల్, ఎల్గీ ఎక్విప్మెంట్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన పట్టొన్స్ ఇంక్ తో భాగస్వామ్యం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాని కంప్రెస్డ్ ఎయిర్ సిస్టమ్‌ను విజయవంతంగా సరిచేసిందన్నారు. ఎల్గీ యొక్క అధునాతన గాలి కంప్రెసర్లు డ్రైయర్ల తో శక్తివంతమైన కొత్త వ్యవస్థ, గణనీయమైన రీతిలో ఖర్చు ఆదా చేయటం తో పాటుగా మెరుగైన ఉత్పత్తి సామర్థ్యం , నాణ్యతకు దారి తీసిందన్నారు. మాన్ ప్లస్ హమ్మెల్ తయారీ కార్యకలాపాలను సమూలంగా మార్చిందన్నారు. ఆటోమోటివ్, వ్యవసాయం, నిర్మాణం, డేటా సెంటర్లు, శక్తి, ఆహారం మరియు పానీయాలు మరియు మరెన్నో పరిశ్రమలకు మాన్ ప్లస్ హమ్మెల్ సేవలు అందిస్తుందన్నారు.

పలు ఉత్పత్తులకి అమేజాన్ పే లో నుండి ప్రత్యేకమైన డీల్స్

విశాలాంధ్ర-విశాఖపట్నం: పలు ఉత్పత్తులకు కి సంబంధించి అమేజాన్ పే భారీ రాయితీలను కలిగి ఉంది. ఏప్రిల్ 7 నుండి ప్రారంభించి, విమానాలు, హెూటళ్ళు, మూవీ టిక్కెట్లు, మరియు ఇంకా ఎన్నో వాటి పై ప్రత్యేకమైన ప్రయోజనాలతో అమేజాన్ పే వేసవి ప్రణాళికను సులభం చేసింది. ప్రయాణిస్తున్నా, బసను అప్ గ్రేడ్ చేస్తున్నా, లేదా సీజన్ కోసం షాపింగ్ చేస్తున్నా, మీరు తక్కువ ఖర్చు చేస్తూనే ఎక్కువ ఆనందించడానికి అమేజాన్ పే సహాయం చేస్తుంది. అమేజాన్ పేతో విమానాలు బుక్ చేయడం ద్వారా వేసవి ప్రణాళికలు ప్రారంభించవచ్చని, ఇండిగో, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్, స్పైస్ జెట్, ఆకాశ, మరియు అలియెన్స్ ఎయిర్ సహా అన్ని ఎయిర్ లైన్స్ లో 25 శాతం వరకు తగ్గింపు ఉన్నట్టు ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. మొదటిసారి విమానం బుక్ చేస్తుంటే, డొమెస్టిక్ అంతర్జాతీయ విమానాల పై రూ. 1000 వరకు అదనంగా 12 శాతం రాయితీ ఉందన్నారు.

రియల్ మీ పీ 3 అల్ట్రా 5జీ, రియల్ మీ పీ 3 5జీ ఆవిష్కరణ

రియల్ మీ బడ్స్ ఎయిర్ 7, బడ్స్ టీ 200 లైట్ ఫీచర్ ప్యాక్

విశాలాంధ్ర-విశాఖపట్నం: రియల్ మీ అనేది భారత యువత లో అత్యంత పేరు గాంచిన స్మార్ట్ఫోన్ బ్రాండ్. అది రియల్ మీ పి 3 సిరీస్ 5 జి యొక్క రెండవ లైన్ అప్ ని గర్వంగా పరిచయం చేసింది. అది ముఖ్యంగా ఇండియా కోసం డిజైన్ చేయబడినది. రియల్ మీ పి 3 అల్ట్రా 5 జి మరియు రియల్ మీ పి 3 5 జి యొక్క లైన్ అప్ ఎక్కడ చూడని ఆధునీకరణ ని భారత వినియోగదారులకు అందిస్తుంది. బలమైన పనితీరు, ఇబ్బంది లేని మల్టీ ట్యాస్కింగ్ మరియు ఆపలేని గేమింగ్ అనుభవం పి 3 సిరేశ్ 5 జి యొక్క కొత్త మైలురాళ్ళని మధ్య రేంజ్ విభాగం లో సెట్ చేస్తాయి మరియు అవి విభాగం లో మొదటి ఆధునీకరణ ని వినియోగదారుని అనుభవం తో మెరుగుపరుస్తాయి. రియల్ మీ పి 3 అల్ట్రా 5 జి మరియు రియల్ మీ పి 5 జి . అవి మిడ్ రేంజ్ విభాగం లో కొత్త బెంచ్ మార్క్ లను సెట్ చేస్తాయి. ఈ పరికరాలు ఎక్కడా చూడని పనితీరు తో గ్రౌండ్ బ్రేకింగ్ డిజైన్ ని అందిస్తాయి మరియు అది పోటీ మార్కెట్ లో కమేండ్ యొక్క దృష్టిని సారిస్తాయి.

భీమిలి మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు మృతి

- పలు విభాగాల్లో టీడీపికి సేవలు -దిగ్భ్రాంతిలో అభిమానులు..
వేములవలస కూడలిలో గురువారం స్వచ్ఛందంగా దుకాణాలు బంద్
అంత్యక్రియలకు పలువురు ప్రముఖుల హాజరు

విశాలాంధ్ర-ఆనందపురం: భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు, ఆనందపురం మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ టీడీపీ సీనియర్ నాయకులు కోరాడ నాగభూషణరావు(62) గురువారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డారు. కోరాడ నాగభూషణరావు అనారోగ్యంతో బాధపడుతుండగా 4 రోజుల క్రితం కుటుంబ సభ్యులు ఆరిలోవలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అయితే నాగభూషణరావు గురువారం ఉదయం 6:30 ప్రాంతంలో ఆసుపత్రి 4 వ అంతస్తు నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సుమారు 30 సంవత్సరాల పాటు ప్రజా సేవలో ఉన్నారు. తండ్రి అప్పలస్వామి నర్సమ్మ దంపతులకు 3వ సంతానంగా కోరాడ నాగభూషణరావు 2001- 2006 వరకు వేములవలస సర్పంచ్ గాను, 2013 నుండి2018 వరకు తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులుగా , 2017 నుండి 2019 వరకు భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గాను సేవలందించారు. భీమిలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి తిరుగు లేని నాయకుడిగా, సౌమ్యుడిగా, ప్రజాసేవకుడిగా మంచి గుర్తింపు పొందారు. ఎన్నో సందర్భాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులు పొందారు. ఈయన అకాల మరణ వార్త తెలిసిన కుటుంబ సభ్యులు, అభిమానులు, ప్రజలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నాగభూషణరావు ఆత్మహత్యకు అనారోగ్య సమస్యలే కారణమా లేక ఇంకే ఇతర సమస్యలేమైనా ఉన్నాయా అన్న దానిపై ఇంకా పూర్తిగా స్పష్టత రావాల్సి ఉంది. విశాఖ కేజీహెచ్ లో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 1 గంట సమయంలో మృతదేహాన్ని వేములవలస కూడలిలో ఊరేగించి అభిమానులు కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవలస కూడలిలో ఉన్న షాపులు యజమానులు స్వచ్ఛందంగా మూసివేసి ఆయనకు కడసారి నివాళులర్పించారు.

కోరాడ కు నివాళులర్పించిన ఎమ్మెల్యే గంటా

కోరాడ నాగభూషణం మృతికి భీమిలి శాసనసభ్యులు గంటా. శ్రీనివాసరావు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆనందపురంలో గురువారం నాగభూషణం పార్థీవ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ బలోపేతానికి నాగభూషణం ఎంతో కష్టపడ్డారని, మరణం ప్రజలకు తీరని లోటూ అని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు అధిక సంఖ్యలో గురువారం మధ్యాహ్నం హాజరై ఆయన భౌతిక దేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. దహన సంస్కారాలు గురువారం నాగభూషణం స్వగ్రామంలో నిర్వహించారు.

కేజీబీవీ విద్యార్థుల కు సబ్ స్టేషన్ ఇంటర్న్‌షిప్

విశాలాంధ్ర-భీమిలి: భీమునిపట్నం మండలం గొల్లలపాలెం గ్రామంలో ఉన్న కస్తూరీబా గాంధీ బాలికా విద్యాలయంలో జిల్లా సమగ్ర శిక్షా ఏపీసి డాక్టర్ జె చంద్రశేఖర రావు జి సి డి ఓ, .కలిషా బేగం , స్టేట్ కో ఆర్డినేటర్ ఎస్.రిషి ఆధ్వర్యంలో 9వ తరగతి ,10 వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులకు మిగిలిన సబ్జెక్టులతో పాటు ఒకేషనల్ కోర్సులు కూడా శిక్షణ ఇస్తూ , గవర్నమెంట్ సర్టిఫికెట్స్ కూడా ఇస్తున్నాం.వాటిలో భాగంగా ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్వేర్ కోర్సులో భాగంగా గొల్లలపాలెం లో ఉన్న సబ్ స్టేషన్ ఇంటర్న్షిప్ కార్యక్రమం ఒకేషనల్ టీచర్ కర్రి యశోద కుసుమ కిరణ్ ఆధ్వర్యంలో జరుగుతుందని మరియు చదువు పూర్తి అయిన తరువాత జాబ్స్ సాధించడానికి కూడా ఈ కోర్సులు ఉపయోగకరంగా ఉంటాయని ప్రిన్సిపాల్ శ్రీమతి గంగా కుమారి తెలియజేసారు.

వాగ్దేవి పాఠశాలలో లో వేసవి క్రీడా శిక్షణా శిబిరం



విశాలాంధ్ర-ఆనందపురం: మండలంలో గంభీరం లో ఉన్న వాగ్దేవి విద్యా మందిర్ పాఠశాలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ రామినేని .రాధాకృష్ణ తెలిపారు. చదువుతోపాటు విద్యార్థులకు శారీరక ఉల్లాసానికి క్రీడలు చాలా ముఖ్యమని అందువల్ల శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా క్రికెట్, స్కేటింగ్, బ్యాడ్మింటన్, కరాటే వాలీబాల్ ,కోకో, క్రీడలు నైపుణ్యత గల కోచ్ లు సమక్షంలో శిక్షణ నిర్వహిస్తామని ఏప్రిల్ 28 నుంచి మే 30 వరకు, సోమవారం నుండి శనివారం వరకు ఉదయం 6:30 నుండి 8 గంటల 30 నిమిషాలకు, నిర్వహించబడతాయని , మిగతా పాఠశాల విద్యార్థులు కూడా 1000 రూపాయలు ఫీజు చెల్లించి ఈ క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొనవచ్చునని, ప్రతి ఒక్క విద్యార్థి కి వేసవి క్రీడా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల కరస్పాండెంట్ తెలిపారు.

పోషకాహారం పైశ్రద్ధ తీసుకోవాలి

ఐసిడిఎస్ పిఓ శ్రీదేవి

విశాలాంధ్ర-ఆనందపురం: పోషకాహారంపై గర్భిణీలు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని ఐసిడిఎస్ పిఓ ఎం శ్రీదేవి పేర్కొన్నారు. ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషకాహార పక్ష వారోత్సవాలలో భాగంగా కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గర్భిణీలు పిల్లల పుట్టిన రెండు సంవత్సరాల వరకు పోషకాహారం తీసుకునే విధంగా అంగన్వాడి కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు ముఖ్యంగా ఆకుకూరలు విటమిన్ టాబ్లెట్లు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలోనూ అంగన్వాడీ కార్యకర్తలు వీటిపై ప్రచారం చేసి బాలింతలు, పిల్లలు ఆరోగ్యంగా ఉండడానికి అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రేఖవాణి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సహనాజ్ సాదియా,సి హెచ్ ఓ శ్రీను, కృష్ణమోహన్ ,అంగన్వాడి కార్యకర్తలు కాసులమ్మ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ ప్రభావిత కళ్ళ జబ్బులకు సత్వర వైద్యం అందించండి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

విశాలాంధ్ర బ్యూరో -విశాఖపట్నం: సెల్ ఫోన్ ప్రభావంతో నెలకొనే వివిధ కళ్ల జబ్బులకు గురయ్యే పిల్లలకు ప్రభుత్వ ప్రాంతీయ కళ్ళ ఆసుపత్రి వైద్యులు సత్వర వైద్యం అందేలా చర్యలను ముమ్మరం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. గురువారం సీతమ్మపేటలో గల రెడ్నం సూర్య ప్రసాదరావు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.మీనాక్షి, ఇన్చార్జి ఆర్ఎంఓ వాసుపల్లి శ్రీలక్ష్మి ల నేతృత్వాన సందర్శించారు,ఈ ఏడాది జనవరిలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలతో ఏర్పాటైన పిల్లల ప్రత్యేక ఓ.పి.చీటీల కేంద్రాన్ని,వైద్యుల తనిఖీ గదిని, పిల్లల శస్త్ర చికిత్సల వార్డులను పరిశీలించారు,పిల్లల ఓ.పి.ఎంత వస్తుంది,వారిని అక్కున చేర్చుకొని వైద్యం అందిస్తున్న తీరు తెన్నులను వైద్యులు,పారా మెడికల్ సిబ్బంది నుండి అడిగి తెలుసుకున్నారు,ప్రధానంగా పిల్లల కంటి వ్యాధులు ఏ రూపంలో వస్తున్నాయి,సెల్ ఫోన్ ప్రభావం ఎంత వరకు ఉందో వివరాలు రాబట్టారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ గతంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక పిల్లల ఓ.పి,కళ్ళ పరీక్షల తనిఖీ గది,శస్త్ర చికిత్సల అనంతరం ప్రత్యేక వార్డు,బెడ్లు ఏర్పాటు చేయడం వల్ల చక్కని ఫలితాలు అందుతుండటం బాలల హక్కుల పరిరక్షణ విజయంగా భావిస్తున్నామని

చెప్పారు,అలాగే ప్రధానంగా సెల్ ఫోన్ ప్రభావంతో ఓపి ద్వారా వచ్చే పిల్లలకు త్వరిత గతిన వైద్యం అందించే విధంగా వైద్యులు చర్యలు చేపట్టాలని సూచించినట్లు తెలిపారు,అలా సెల్ ఫోన్లు అనర్థాలపై వైద్యులు బృందాలుగా ఏర్పడి పాఠశాలల్లో ను,పౌర సమాజంలో విరివిగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.మీనాక్షి మాట్లాడుతూ ఇటీవల కాలంలో తమ ఆసుపత్రిలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలను అమలు వివిధ బాలల హక్కులు,వారి సంక్షేమానికి పూర్తి మద్దతునిచ్చేల చర్యలు చేపడుతున్నామని అన్నారు,బాలల్లో ఏర్పడే వివిధ కంటి వ్యాధులతో పాటు సెల్ ఫోన్లు,ఇతర పరికరాలతో ఎదురయ్యే వివిధ వ్యాధులకు ప్రత్యేకంగా వైద్యంతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేసేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగానే ఉంటామని చెప్పారు. సీతారాం వెంట ఆసుపత్రి వైద్యులు,పారా మెడికల్ సిబ్బంది తదితరులున్నారు.

నిబంధనలు గాలికి...

రాజకీయ పలుకుబడితో అక్రమ వ్యాపారం...

విశ్వనాథ్ స్పోర్ట్స్ అడ్వెంచర్ కాశీ పై కేసు నమోదు





విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : రాజకీయ నేత అంటూ అడ్డదారిలో ప్రభుత్వ స్థలాలను కాజేసి గతంలో అనేక ప్రాజెక్టులు నిర్మించారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వ్యక్తమైన కాశీ విశ్వనాథ్ కన్స్ట్రక్షన్స్ అధినేత కాశీ పై తాజాగా మరో కేసు నమోదు అయింది. సమయ పాలన లేకుండా, ఇస్తారాజ్యంగా, కనీస భద్రత ప్రమాణాలు పాటించకుండా అక్కయ్యపాలెం పోర్ట్ స్టేడియంలో నిర్వహిస్తున్న విశ్వనాథ్ స్పోర్ట్స్ అడ్వెంచర్ యజమానిగా ఉన్న కాశీపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం పోలీసులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇటీవల ఓ బాలుడు మృతి చెందిన సంఘటన తెలిసిందే. స్విమ్మింగ్ పూల్ లో బాలుడు రిషి(7) మృతిపై ఎట్టకేలకు పోలీసుల చర్యలు చేపట్టారు. విశ్వనాథ్ స్పోర్ట్స్ అడ్వెంచర్స్ యజమాని బిడ్డేటి కాశీపై కేసు నమోదు చేయగా, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఇప్పటికే సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అడ్డగోలుగా స్పోర్ట్స్ క్లబ్ నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మరింత లోతుగా దర్యాప్తునకు పోలీసులు నిర్ణయం చేసినట్లు సమాచారం. బాలుడు మృతి సందర్భంగా ఆ కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని ఇప్పటికే వామపక్షాలు డిమాండ్ చేశాయి. కాశీకి అధికార, ప్రతిపక్ష పార్టీలో నేతలతో సంబంధాలు దండిగా ఉండడంతోనే అడ్డగోలు వ్యాపారాలకు ఇష్టారాజ్యంగా మారిపోతుందని పెద్ద ఎత్తున ఆరోపణలు వ్యక్తమవతున్నాయి. టిడిపి, వైసిపి పార్టీలు లో చేరి, ఎవరు అధికారంలో ఉంటే వారి వెంట తిరిగి తమ వ్యాపారాలు చక్కబెట్టుకోవడంలో మహా దిట్ట అని పెద్ద ఎత్తున ప్రచారం ఉంది.

16వ బెటాలియన్ లో ఏఆర్‌సీ కోర్సులు

విశాలాంధ్ర-పీఎం పాలెం: 16వ బెటాలియన్ అధిపతి కె.వి మురళీకృష్ణ కమాండెంట్ ఆధ్వర్యం లో 4వ బ్యాచ్ యాన్యువల్ రిఫ్రెషర్ కోర్స్ గురువారం ఉదయం ఇనాగరేషన్ చేయడం జరిగింది. ఈ ఏఆర్సి కోర్స్ ఉద్దేశం ఏమిటంటే మన ఏపీఎస్పీ సిబ్బంది ఔట్ పోస్టులు అనగా నక్సలైట్లు ప్రభావిత ప్రాంతంలో రౌండ్ ది క్లాక్ 24 బి7 డ్యూటీలో ఉంటారు కాబట్టి వారి యొక్క కుటుంబాలతో గడపడం కోసం మన బెటాలియన్ అధికారులైనా అడిషనల్ డీజీ, ఐజీ, పెద్ద పెద్ద ఆఫీసర్లు అందరూ సిబ్బంది యొక్క ఫ్యామిలీతో గడపడం కోసం. ఈ రెండు వారాలు కోర్స ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతే కాకుండా సిబ్బంది వారు బేసిక్ ట్రైనింగ్ లో నేర్చుకున్నటువంటి కొన్ని కొన్ని విషయాలు మళ్లీ నెమరు వేసుకునుటకు. దానిలో భాగంగా మార్నింగ్ సెక్షన్ పిటీ అండ్ స్టైంతనింగ్ అలాగే అదే భాగంగా 2వ సెషన్ వెపన్స్ ట్రైనింగ్ అలాగే ఇండోర్ క్లాసెస్ (ఇండో క్లాసుల్లలో సర్వీస కు సంబంధించినటువంటి ఏవైనా అనగా సిబ్బంది యొక్క సెలవులు గాని వారికి రావాల్సిన ఎలవంసులు గాని ఏవైనా అప్డేట్ సరింగా జరగని జరగనివ్వటువంటి గురించి తెలుసుకొని సర్వీస్ బుక్ చూసుకొని వాటిని దగ్గరుండి సరిచేసుకొనుటకు ఈ కోర్స్ ఉపయోగపడుతుంది ఇటువంటి కోర్సులు ప్రతి బెటాలియన్ లో జరుగుతూ ఉంటాయి . ఈ ఏ ఆర్ సి కోర్సు ఇలా జరుపుకోవడం వలన సిబ్బంది ఒకే దగ్గర అవుట్ పోస్టులు డ్యూటీలో ఉండిపోకుండా పోస్ట్ చేంజింగ్ చేస్తూ వారిని ఉత్సాహపరచుటకు ఉపయోగపడతాయన్నారు.

మాదక ద్రవ్యాలు నివారణ కోసం కలిసికట్టుగా పని చేద్దాం

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-భీమిలి: మాదక ద్రవ్యాలు నివారణ కోసం కలిసికట్టుగా పని చేద్దామని సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని విశాఖ పట్నం సిటీ పోలీస్ కమీషనర్ శంఖబ్రత భాగ్చీ అన్నారు. గురువారం భీమిలి మండలం , దాకమర్రి లో ఉన్న రఘు ఇంజనీరింగ్ కాలేజీలో "నవ సమాజ నిర్మాణం" అనే కార్యక్రమం పై ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నారనీ ఆ సైబర్ నేరాలు పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా యువత ఎక్కువగా చదువుకుని కావలసిన ఉద్యోగం రాకపోతే సైబర్ నేరాలు కు పాల్పడుతారనీ చెప్పారు. మొబైల్ ఫోన్ ద్వారా మన భారతదేశంలో ప్రతీ 1.2 లక్షల కోట్లకు పైగా నష్టపోయారనీ అన్నారు. అంతేకాక మాదకద్రవ్యాలు సేవించడం వలన ఎంతోమంది కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయనీ చెప్పారు. మాదక ద్రవాలు వలన చాలా చెడు ప్రభావం ఉంటుందని, అంతేకాకుండా హెల్త్ పరంగా అనేక సమస్యలు ఎదురవుతాయనీ చెప్పారు. అనేక సమస్యలు , మానవ నాడీ వ్యవస్థ ,ఒత్తిడి,భయం, ఉద్యోగంపై ప్రభావం చూపుతుందనీ చెప్పారు. ఇటీవలయువత ఎక్కువగా ఒత్తిడి కి లోనయి ఆత్మహత్య లకు పాల్పడుతున్నారనీ చెప్పారు. ప్రేమ విఫలం అయిం దనీ, మార్కులు ఎక్కువగా రావడం లేదనీ , తల్లితండ్రులు మందలించారనీ, అప్పు తీర్చలేకపోతున్నందుకు, ఆన్లైన్ బెట్టింగ్ ఇలా తదితర కారణాల వలన జీవితం నాశనం చేసుకుంటున్నారనీ తెలిపారు. మానవ జీవితం చాలా విలువైనదనీ పోతే తిరిగి రాదనీ ప్రతీ వ్యక్తి జీవితం లో ఎన్నో ఇబ్బందులు కు గురవుతారనీ మనిషి జీవితం లో కష్టాలు సుఖాలు ఉంటాయనీ , ఆత్మహత్య సరైనది కాదనీ అన్నారు.ఎవరికైనా ఇబ్బందులు ఉంటే మాకు తెలియపరచాలనీ పోలీస్ కమీషనర్ నెంబర్ 7995095799 అనీ ,1972 టోల్ ఫ్రీ నెంబర్ కు గానీ తెలియపరచాలనీ అన్నారు. సైబర్ క్రైమ్ హ్యాకింగ్ సైబర్ నేరాలు మెసేజులు వస్తుంటాయని ఫిషింగ్ మిస్సింగ్ డీప్ వెబ్ డార్క్ వెబ్ సిమ్ స్కాం సోషల్ మీడియా ఫ్రాడ్ ఏటీఎం ఫ్రాడ్ ద్వారా జరుగుతున్న సైబర్ క్రైమ్ అరికట్టాలంటే అనుమానం వచ్చిన నెంబర్ను లిఫ్ట్ చేయకుండా పోలీసులకు తెలియపరచి తద్వారా తెలుసుకొని అప్పుడు లిఫ్ట్ చేయాలని తెలియని నంబర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు ఈ కార్యక్రమంలో ఏసీపి అప్పలరాజు విశాఖ డిప్యూటీ కమిషనర్ అజిత్ భీమిలి సి ఏ తిరుమలరావు ఎస్సై హరీష్ పాల్గొన్నారు.